క్లుప్తంగా

సంఘ భవన నిర్మాణానికి నిధులివ్వండి



నిధులివ్వాలని కోరుతున్న సర్పంచ్

కోనరావుపేట: మండల కేంద్రంలో వంజరి సంఘ భవన నిర్మాణానికి నిధులు ఇవ్వాలని సర్పంచ్ పోకల రేఖ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను కోరారు. శుక్రవారం ఆమెను కలిసిన సర్పంచ్, గ్రామస్తులు గ్రామంలోని వంజరి సంఘ భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వంజరి సంఘం అధ్యక్షుడు విష్ణు, ఉపాధ్యక్షుడు మహేశ్, సభ్యులు రాజం, దశరథం, రాములు, శ్రీనివాస్, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు తొలిమెట్టుపై శిక్షణ



శిక్షణను పరిశీలిస్తున్న నోడల్ అధికారి విఠల్

ముస్తాబాద్: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ముస్తాబాద్ మండల వనరుల కేంద్రంలో తలపెట్టిన తొలిమెట్టు శిక్షణ శిబిరం శుక్రవారం జరిగింది. గణితశాస్త్ర ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణ శిబిరాన్ని జిల్లా డీఆర్‌పీలు సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్య బోధన, విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీసేలా శిక్షణ జరుగుతుందని నోడల్ అధికారి విఠల్‌నాయక్ తెలిపారు. సహజ నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు పనిచేస్తారన్నారు. ఎంఈవో బన్నాజీ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రాధాకిషన్‌రావు, ప్రభాకర్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ శ్యాంసుందర్‌శర్మ, శివశంకర్, రాజేందర్, ఎమ్మార్సీ ఇన్‌చార్జిలు శ్రీకాంత్‌రెడ్డి, తుమ్మ రాజేందర్, సాయి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నార్మల్ డెలివరీ



కేసీఆర్ కిట్ అందిస్తున్న వైద్యాధికారి గీతాంజలి

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ పీహెచ్‌సీలో శుక్రవారం నార్మల్ డెలివరీ చేసినట్లు వైద్యాధికారిణి గీతాంజలి తెలిపారు. పోతుగల్ గ్రామానికి చెందిన వంగపల్లి సంధ్యకు పురిటినొప్పులు రాగా ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పీహెచ్‌సీకి తరలించారు. సంధ్యకు తొలికాన్పు నార్మల్ డెలివరీలో పాప జన్మించిందని, మూడు కిలోల బరువుతో ఆరోగ్యంగా ఉందని, ఆమెకు కేసీఆర్ కిట్ అందజేసినట్లు తెలిపారు. నార్మల్ డెలివరీపై కలెక్టర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో శ్రీరాములు అభినందించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ సాహితి, స్రవంతి, పీహెచ్‌ఎస్ జ్యోతి పాల్గొన్నారు.

తుఫాన్ కొంపముంచింది.!

- ఎర్రబడిన పత్తి చేలు
- నిలిచిన పంట ఎదుగుదల
- పెట్టుబడులు కూడా అనుమానమే
- 300 ఎకరాల్లో పంట నష్టం

వేములవాడరూరల్: వాతావరణ మార్పులతో ఊహించని విధంగా తుఫాన్ రూపంలో వచ్చిన ఎడతెరిపిలేని వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేశాయి. ఈ వర్షాకాలం విత్తనాలు విత్తిన తరువాత వర్షాలు రాక కొంత మంది రైతుల విత్తనాలు భూమిలోనే మురిగిపోయాయి. వరుణ దేవుడి కోసం ఎదురుచూసిన రైతన్నకు తుఫాన్ రూపంలో వచ్చిన వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. పత్తి విత్తనాలు విత్తు చేసి, వరి నాట్లు పూర్తి చేసిన రైతన్నలు వాటికి కావాల్సిన ఎరువులు, మందులు, కూలీలతో కలుపు తీయించారు. వీటికి దాదాపు ఎకరానికి రూ.2 నుంచి రూ.3 వేల వరకు ఇప్పటికే రైతన్నలు పెట్టుబడులు పెట్టారు. అనుకోని తుఫాన్‌తో పంటలు పూర్తిగా ఎర్రబడి ఎదుగుదల లేకపోవడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావోనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన పంటలను ప్రభుత్వం అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు సర్వేలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు తప్ప అవి రైతులకు పరిహారం వస్తుందో, రాదో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



లింగంపల్లిలో ఎర్రబడిన పత్తి పంట

వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో 4 వేల ఎకరాలకు పత్తి పంట, 8 వేల ఎకరాల్లో వరి పంటను ఈ సంవత్సరం రైతులు సాగు చేశారు. వేములవాడ అర్బన్ మండలంలోని 11 గ్రామాల్లో 2,500 ఎకరాల్లో పత్తి, 3,200 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇందులో ఇప్పటికీ నల్లరేగడి ఉన్న భూముల్లో నీరు ఇంకా నిలిచి ఉండడంతో మొక్కలు నీటిలోనే మురిగిపోతున్నాయని రైతులు తెలిపారు. వరి పొలాల్లో కూడా నీళ్లు భారీగా చేరడంతో వాటిని రైతులు తొలగించినప్పటికీ ఎదుగుదల లోపించిందని మళ్లీ పెట్టుబడులు పెట్టి మందులు కొట్టినా ఫలితం దక్కేలా లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అన్ని గ్రామాల్లో అదే పరిస్థితి

వేములవాడ మండలంలో తుఫాన్ వర్షంతో దాదాపు అన్ని గ్రామాల్లో అదే పరిస్థితి నెలకొంది. తుఫాన్‌తో ఎడతెరిపి లేకుండా నాలుగు రోజులు కుండపోత వర్షం కురవడంతో కుంటలు, చెరువులు నిండడంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న కల్వర్టులు కూడా కొట్టుకుపోయాయి. వీటి వల్ల కల్వర్టుల కింద ఉన్న పొలాలు పూర్తిగా నీటితో నిండిపోయి మట్టి పేరుకుపోయింది. వర్షం తగ్గినప్పటికీ మట్టి పేరుకుపోవడంతో పాటు మరో నాలుగు రోజులు వర్షపు నీరు నిల్వ ఉండడంతో రైతన్నలకు పెద్ద నష్టం జరిగింది.

300 ఎకరాల్లో నష్టం అంచనా

వేములవాడ రూరల్, అర్బన్ మండలాల్లో తుఫాన్ ప్రభావం వల్ల దాదాపు 300 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రధానంగా జయవరం, బొల్లారం, లింగంపల్లి గ్రామాల పక్కన ఉన్న మూలవాగు వర్షాల వల్ల తీవ్రంగా పారడంతో వాటి పక్కన ఉన్న పత్తి, వరి పంట పూర్తిగా నీటిలో మునిగిపోయింది. వీటితో పాటు ఇతర గ్రామాల్లో కుంటలు, చెరువుల వల్ల కూడా వ్యవసాయ పంట పూర్తిగా దెబ్బతింది. దాదాపు 300 ఎకరాల వరకు నష్టం జరిగినట్లు అధికారులు నివేదిక తయారు చేస్తున్నారు.

గడ్డిలోనే మునిగిన పంట



ఈ సంవత్సరం వర్షాలు ఆలస్యంగా రావడంతో పంటలు కూడా ఆలస్యంగానే వేశాం. తుఫాన్‌తో పంటలు దెబ్బతినడంతో పాటు పూర్తిగా గడ్డి పెరిగి ఎదుగుదల లేకుండా పోయింది. ఇప్పటికే రెండుసార్లు పెట్టుబడులు పెట్టాం. మళ్లీ పెట్టలేక వదిలేశాం.

– దాసె కొమురయ్య, రైతు, అచ్చన్నపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



తుఫాన్ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి. ఇప్పటికే రూ.వేల పెట్టుబడులు పెట్టి ఉన్న రైతన్నలకు ఈ తుఫాన్ వల్ల కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు. ఎలాగైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– పుల్లూరి రమేశ్, రైతు, లింగంపల్లి

అంతా వాగులోనే పోయింది



నాకున్న ఎకరంన్నర పొలం మూలవాగు పక్కన ఉండడంతో వాగు ఉప్పొంగడంతో, అంతా వాగులోనే పోయింది. పెట్టుబడులు పెట్టి లాభాలు వస్తాయని ఆశించినా, నిరాశే మిగిలింది. పూర్తిస్థాయిలో సర్వే చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– కాతుబండ శేఖర్, రైతు, జయవరం

నివేదిక తయారు చేస్తున్నాం



నష్టపోయిన పంటల వివరాలతో నివేదిక తయారు చేస్తున్నాం. వర్షం వల్ల పత్తి, వరి చేలల్లో నీటి నిల్వలను తొలగించాలి. పత్తి పంట ఎకరాకు ఒక కిలో ఎన్‌పీకే 19-19-19 పిచికారీ చేయాలి. ఫార్ములా 4ను 200 గ్రాములు ఎకరానికి విడిగా పిచికారీ చేయాలి.

– సాయికిరణ్, ఏవో, వేములవాడ

ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్టు



ముస్తాబాద్ ఠాణాలో ఏఎన్‌ఎంలు

ముస్తాబాద్/చందుర్తి: చలో అసెంబ్లీ పిలుపు దృష్ట్యా రెండో ఏఎన్‌ఎంలను ముస్తాబాద్, చందుర్తి పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం వసంత, విజయనిర్మల మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కావాలని కోరుతున్నామన్నారు. 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జలేంద్ర, రేణుక, రేఖ, నర్సమ్మ, ప్రమీల, రాజశ్రీ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



రామన్నపేటలో బర్రెకు టీకా వేస్తున్న వైద్యుడు

కోనరావుపేట/వేములవాడరూరల్/బోయినపల్లి: కోనరావుపేట మండలంలోని రామన్నపేట, వేములవాడ అర్బన్ మండలంలోని గుర్రంవానిపల్లి, బోయినపల్లి మండలంలోని మల్లాపూర్, మాన్వాడ గ్రామాల్లో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేశారు. పశుపోషణ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, ఎంపీటీసీ మల్లేశ్, పశువైద్యాధికారి అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి స్వాగతం పలికేందుకు వెళ్లిన నాయకులు

వేములవాడ/ముస్తాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్..తొలిసారిగా రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు చక్రధర్‌రెడ్డి, వేములవాడకు చెందిన బీజేపీ నాయకులు గోపు బాలరాజు, బండ మల్లేశం, రేగుల మల్లికార్జున్, జక్కుల తిరుపతి, రేగుల సంతోష్‌బాబు, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి, నాయకులు కోల కృష్ణ, క్రాంతి, దేవేందర్, మహేందర్, శ్రీనివాస్‌రావు, రమేశ్‌రెడ్డి, బండి శ్రీకాంత్, ఉపేంద్ర ఉన్నారు.

మండల పరిషత్‌కు చేరుకున్న క్రీడా సామగ్రి

చందుర్తి: క్రీడా ప్రాంగణాలు పూర్తయిన గ్రామాల్లో అందజేసేందుకు క్రీడా సామాగ్రి చందుర్తి మండల పరిషత్ కార్యాలయానికి శుక్రవారం చేరుకున్నాయి. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలకు ఈ సామాగ్రిని త్వరలోనే అందజేస్తామని ఎంపీడీవో రవీందర్ తెలిపారు. అసంపూర్తిగా ఉన్న క్రీడా ప్రాంగణాల్లో మిగతా పనులు పూర్తి చేయాలని కోరారు.

వంటావార్పు



చందుర్తి/తంగళ్లపల్లి/వీర్నపల్లి: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 30వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం వినూత్న రీతిలో నిరసనలు వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుల వంటావార్పు, మండలంలోని మల్యాల, కట్టలింగంపేట, చందుర్తి గ్రామాల్లో బిక్షాటన చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు. 30 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో చలనం లేక కార్మికులను చిన్నచూపు చూస్తుందని వారు అసహనం వ్యక్తం చేశారు. వీర్నపల్లి: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెకు అన్ని గ్రామాల సర్పంచులు మద్దతు తెలిపారు.

చిత్రకథ



తవ్వారు... వదిలారు

వేములవాడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేములవాడ పట్టణం చెక్కపల్లి రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వరదనీరు వచ్చి చేరింది. దీంతో సెస్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సబ్‌స్టేషన్లోని వరద నీరు ఖాళీ చేసేందుకు అధికార యంత్రాంగం బైపాస్ రోడ్డును తవ్వేసి నీటిని రాజన్న గుడి చెరువులోకి వదిలారు. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా, రోడ్డును తిరిగి బాగుచేయకుండా ఇలా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ఈ గుంత కనిపించకపోవడంతో ఇందులో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని స్థానికులు భయపడిపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికలకు ఐరన్ పోషకాలు అందజేత



వేములవాడ: శిశుమందిరంలో స్కూల్లో చదువుతున్న బాలికలకు శుక్రవారం బెల్లంతో కూడిన తినుబండారాలను అధ్యాపకులు, నిర్వహణ కమిటీ సభ్యులు అందజేశారు. డాక్టర్ కే.మనోహర్, మోటూరి మధు, గర్లకుర్తి వెంకన్న, హెచ్‌ఎం చిలుకగట్టు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



మరిమడ్లలో గండిని పరిశీలిస్తున్న నాయకులు

కోనరావుపేట: అధిక వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతులను ఆదుకుంటామని చల్మెడ ఆస్పత్రి చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలంలోని మరిమడ్లలో నష్టపోయిన పంటలు శుక్రవారం పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించి అనంతరం మాట్లాడారు. చెక్‌డ్యామ్ కోతకు గురై పొలాలన్నీ మట్టి, ఇసుక మేటలు వేశాయన్నారు. మూలవాగును ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరుగకుండా శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. రైతుల సమస్యలను మంత్రి కేటీఆర్ దృష్టికి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట వేములవాడ ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, డైరెక్టర్లు దుంపెట రాజేశం, గ్రామ పెద్దలు కోల శ్రీనివాస్, జింక శ్రీనివాస్, సింగం నారాయణ, గుంటి నాగరాజు, మహంకాళి శంకర్, మ్యాకల శంకర్, బొల్లం దేవయ్య, నాయకులు ముష్కం జీవన్, గంగసాని రమణారెడ్డి రైతులు ఉన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎంవీఐ కిశోర్‌చంద్రరెడ్డి

సిరిసిల్లక్రైం: జిల్లాలోని స్కూల్ బస్సులను శుక్రవారం ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేశారు. తంగళ్లపల్లి మండలంలోని మూడు బస్సులను తనిఖీ చేసి, ఒక బస్సును సీజ్ చేసినట్లు ఎంవీఐ కిశోర్‌చంద్రరెడ్డి తెలిపారు. విద్యార్థుల కోసం వినియోగించే వాహనాలకు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయరాదని జిల్లా రవాణాశాఖాధికారి కొండల్‌రావు సూచించారు. విద్యార్థులను నిర్ణీత సంఖ్యలోనే తీసుకెళ్లాలని, బస్సు డ్రైవర్ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు.

గ్రామాల్లో పంచాయతీలు నిర్వహించొద్దు

- మీ కోసం కార్యక్రమంలో వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్



వట్టెంలలో మాట్లాడుతున్న సీఐ కృష్ణకుమార్

వేములవాడరూరల్: పోలీసులు మీ కోసమే పని చేస్తున్నారని, గ్రామాల్లో ఎలాంటి పంచాయతీలు నిర్వహించరాదని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలో శుక్రవారం సాయంత్రం మీ కోసమే పోలీసులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు వస్తే 100 డయల్‌కు ఫోన్ చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు 1930 నంబర్‌కు కాల్ చేసి డబ్బులు పోకుండా ముందస్తు తీసుకోవాలన్నారు. రానున్న వినాయక చవితి వేడుకల్లో డీజేలు పెట్టకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నవారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఫోన్‌లు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, లేని వారికి తామే పోలీస్ శాఖ తరుపున ఇప్పిస్తామని, వారి వివరాలను అందించాలని అన్నారు. గ్రామంలో పంచాయతీలు నిర్వహించవద్దని, ఏదైనా భూసమస్యలు ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యామ సుమతి, ఎస్ఐ మారుతి, ఏఎస్ఐ లక్‌పతి, సిబ్బంది,గ్రామస్తులు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

తంగళ్లపల్లి: మండల నూతన తహసీల్దార్‌గా విజయ్‌ప్రకాశ్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బైరి రమేశ్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరినేని రాము, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సిలివేరి నర్సయ్య, న్యాయవాది బొద్దుల రాజేశ్ ఉన్నారు.

మొబైల్ అప్పగింత



సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణానికి చెందిన శుద్ధిమల్ల నిరికిషన్ సెల్‌ఫోన్ పోయినట్లు పోలీసులను శుక్రవారం ఆశ్రయించడంతో ఆధునిక సాంకేతికతతో దర్యాప్తు చేసి అతని సెల్‌ఫోన్ అప్పగించినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. సెల్‌ఫోన్ పోయినట్లయితే వెంటనే Ceir.gov.in అనే వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేయాలని దాని ఆధారంగా దర్యాప్తు చేసి మొబైల్‌ను రికవరీ చేయడానికి వీలుంటుందని సీఐ వివరించారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



తంగళ్లపల్లి: అత్యవసర సమయాల్లో ప్రాణాలను నిలబెట్టేందుకు సీపీఆర్‌పై అందరికీ అవగాహన ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మండెపల్లి చౌరస్తాలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, హెల్త్ కోఆర్డినేటర్ బాలయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులకు శుక్రవారం రోడ్డు భద్రత, సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తంగళ్లపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షీ టీమ్ సేవలు ఉపయోగించుకోవాలి

వీర్నపల్లి: షీ టీమ్ సేవలను ఉపయోగించుకోవాలని ఏఎస్ఐ ప్రమీల అన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో షీ టీమ్, సైబర్ నేరాలపై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ చాటింగ్, వీడియో కాల్స్ అపరిచితులతో చేయొద్దని, ఫొటోలు షేర్ చేయొద్దన్నారు. ఎవరైనా మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడితే టోల్ ఫ్రీ నెంబర్ 87126 56425కు సమాచారం ఇవ్వాలన్నారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో ఏదైనా సమస్య వస్తే షీ టీమ్‌ని సంప్రదించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేరును గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రవి, షీటీమ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, 112 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: జాతీయ స్థాయి ఉత్తమ సామాజిక సేవా కార్యకర్త అవార్డు అందుకున్న స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డిని శుక్రవారం రెడ్డి, ఆరె కటిక, పవర్ యూత్, కేసీఆర్ కాలనీవాసులు, రెడ్డి పటేల్ సంఘం సభ్యులు వేర్వేరుగా సన్మానించారు. కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మురుగుకుంటను మరమ్మతు చేస్తాం

ఎల్లారెడ్డిపేట: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో జనావాసాల్లో కంపుకొడుతున్న మురుగు కుంటను మరమ్మతు చేస్తామని సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. అధికారులతో కలిసి శుక్రవారం మురుగు నీటి కాలువను పరిశీలించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొజ్జ కనకరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. సుతారి లక్ష్మి రూ:37 వేలు, తాటిలెంక రాజు రూ:34 వేల చెక్కులను పంపిణీ చేశారు.

రూ.లక్ష ఎల్‌వోసీ అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్‌కు చెందిన కర్నె సంజీవ్‌కు నిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ ఉండగా సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీని బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు.

నోటుబుక్కులు పంపిణీ

సంక్షిప్త వార్తలు

బోయినపల్లి: మండలంలోని నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మార్తాండరావు ట్రస్ట్ చైర్‌పర్సన్ చెన్నాడి రాజ్యలక్ష్మి శుక్రవారం నోటు బుక్కులు పంపిణీ చేశారు.

దళారులను ఆశ్రయించొద్దు

వీర్నపల్లి: బీసీ కార్పొరేషన్ ఆర్థికసాయం కోసం మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని ఎంపీడీవో నరేశ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో 374 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి సందేహాలున్నా కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు.

ఫ్రైడే డ్రైడే

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దేవునిగుట్టతండాలో శుక్రవారం ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. మండల వైద్యాధికారిణి స్రవంతి, సర్పంచ్ పెంటయ్య, కార్యదర్శి, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

ఇల్లంతకుంట: హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేపాక, సోమారంపేట గ్రామాల్లో హరితహారం ద్వారా నాటుతున్న మొక్కలను ఏపీవో చంద్రయ్య పరిశీలించారు.

ఇన్‌చార్జి కార్యదర్శిగా శ్రీనివాస్

ముస్తాబాద్: పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. కార్యదర్శి రాజు దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా బాధ్యతలను అప్పగించినట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు.